ఆదర్శ నారీమణి

శ్రీమతి పులిపాక బాలాత్రిపురసుందరమ్మ

‘ఇందిరా! ఏంచేస్తున్నావు? జ్ఞాపకమున్నామా?’

‘ఓహో మాలతీ! ఎప్పుడొచ్చావు? బస్తీకి వెళ్లినదానివి నీవు మరవాలి గాని మాకేంమరుపు? అంతా క్షేమమా? మీ అమ్మకు జ్వరమట నిమ్మళంగా ఉన్నదా?’

‘చూచి వెళ్లుదామనే వచ్చాను. కొంచం తగ్గింది గాని ఇక్కడ నాకేమీ తోచటంలేదే ఇందిరా!’

‘అక్కడేంచేస్తూ ఉంటావు తోచేపనులు మాలతీ?’

‘ఏదో చేస్తూనే ఉంటాను. యెంబ్రాయడరీ వర్కు, రిబ్బన్ వర్కు, కుషన్ వర్కు, నెంబరు దారంతో కర్టన్సు, టేబులు క్లాత్సు యేవో ఇల్లాగంటివే చేస్తూఉంటాను.’

‘ఇక్కడికి తెచ్చుకోలేకపోయావు?’

‘రెండుగోజుల కెందుకని తెచ్చుకోలేదు. తెచ్చుకున్నా లాభంలేదు. ఏదో ఒకదారం లేకపోతే ఈ ఊళ్లో దొరకదు. అది మూలపడి ఉండవలసిందే మళ్లీ వెళ్లిందాక. మునుపొచ్చినప్పుడు ఇల్లాగే యిబ్బందైంది. మా నాన్నగార్ని తెనాలినుంచి తెచ్చిపెట్టమంటే ఒకటి చెబితే ఇంకొకటి తెచ్చారు. అందుకని ఈ మాటు తెచ్చుగోలేదు. నీకెల్లా ప్రొద్దుపోతుంది? ఇందిరా. నువ్వేమన్నా చేతిపనులు చేస్తూ ఉంటావా?’

‘చేతిపనులంటే యేమిటి? మాలతి!’

‘యేమున్నాయి ఇవ్వే—కుట్లూ, అల్లికలు, పూసలతో బుట్టలు, పళ్లాలు ఇల్లాంటిపనులే చేస్తూ ఉంటాను.’

‘ఏం పనులో నువ్వు చెప్పినవి నాకు వక్కటన్నా అర్థంకాలేదు. తెలుగుతో చెప్పు.’

‘తెలుగులోనే చెప్పాను. రిబ్బన్ వర్కు అంటే పటములు, యంబ్రాయడరీ వర్కు అంటే గుడ్డల మీద రంగుదారములతో కుట్టటం, పూసలతో లేసులల్లి రవికలకు గౌనులకు వేసుగోడం, పూసలతో బుట్టలు, పళ్లాలు బొమ్మలడగ్గిరికి పనికివచ్చేవి అల్లుకోవడం, ఇవ్వే చేతిపనులు. ఇంకేమున్నాయి.’

‘ఇవ్వన్నీ యెట్లా వస్తాయి మాలతి!’

‘డబ్బుపెట్టి కొనుక్కుంటే వస్తాయి.’

‘అవి నావల్ల కాదు. నీ భర్తకు నూరు రూపాయలు జీతం గనక, నీ ఇష్టంవచ్చినట్లు ఖర్చు పెడతావు. మాకన్నీ పండిన గింజల్లోనే జరగాలి. ఇట్లాటి ఖర్చులు పెడతానంటే మా పంతులుగారు ఊరుకోరు. నాకూ ఇష్టంలేదు.’

‘నీకు ఇష్టంలేదనుగాని, మీ పంతులుగారిమీద వెయ్యడం, ఎల్లా వొస్తాయని పేదపలుకులు ఎందుకూ? నీకే ఇష్టంలేదు గనుక ఊరుకున్నావు. మీవాళ్లిచ్చిన పొలంమీద డబ్బేంచేస్తున్నావు?’

‘ఉన్నది, దానధర్మం చేస్తూఉంటాను.’

‘అయితే? ఇందిరా! నీకు ప్రొద్దెల్లా గడుస్తుంది?’

‘నాకు శ్రద్ధే చాలదు.’

‘ఏం చేస్తావు?’

‘నేనూ కొన్ని చేతిపనులు గృహపరిశ్రమలు చేస్తాను.’

‘ఏం పనులు చేస్తావు? నాకు చూపించవు?’

‘నా పనులు నీవుచూచి ఆక్షేపిస్తావు.’

‘ఆక్షేపించనులే చూపించు.’

‘విస్తళ్లు కుడుతాను, మజ్జిగచేసి వెన్నకాచి నెయ్యిచేస్తాను. వాడుకోంగా మిగిలినది అమ్మిస్తాను.’

‘ప్రేవేటుగానా? పబ్లీకుగానా? అమ్మించడం?’

‘పబ్లీకుగానే. తప్పేమున్నది. మిగిలితే యేంచేస్తారు?’

‘ఇంకా యేంచేస్తావు?’

‘రాట్నం వడుకుతాను. వడికినదారం కొంత మూడుపేటలుగా వేసి మళ్లీ వడికి ఆ దారంతో ఇల్లమీదికి వాకిళ్లకు గుడ్డలల్లుతాను. పేడమురుగుడువేయించి పిడకలుచేయించి మేము వాడుకోంగా మిగిలినవి అమ్మిస్తాను. ఇంటికి సరిపడు కుంకుమ నేనే తయారుచేస్తాను. మల్లెపువ్వులు, గులాబిపువ్వులు మా పెరట్లో పూస్తాయి. ఆ పువ్వులు, కచూరములు ఇంకా కొన్నిదినుసులువేసి తలనూనె కాచుతాను. ఆముదములు వండి చమురు తీస్తాను. పెరటిలో పొట్లా, కాకర, చిక్కుడు మొదలైన కాయకూరలు, దబ్బనారింజ సపోటా మొదలైన ఫలములు, నూపర మొదలైన ఇతర యెరువులులేకుండా, మా పశువుల యెరువుతోనే పండించుగుంటాము. ఈ పనులు చూచుగుంటూ తీరిక వేళలప్పుడు పురాణగ్రంధములు చదువుకుంటాను.’

‘అబ్బా ఇందిరా! ఇంత కష్టపుపనులు నేను చెయ్యలేనే. అందుకనే నీవు చూడు నాకంటే చిన్న దానవుకదా? యెల్లా మోటుతేలావో చూడు. అంత గొప్పకుటుంబంలో పుట్టి ఇంత గొప్పకుటుంబంలోకి వచ్చి నీకెందుకు ఈ కష్టం?’

‘నేను ఈ కష్టం చెయ్యకపోతే జరగదని కాదు. మాలతి! గొప్ప కుటుంబీకులు గనుక వళ్లువంచి సోమరితనం మాని పనులుచేస్తూంటే కొద్ది కుటుంబాలవాళ్లుకూడా మనలనుచూచి నేర్చుకుంటారు. మనము సోమరితనంగా ఉంటే మనము ఆక్షేపిస్తామని జంకేవారు కొందరు. గొప్పవాళ్లు అంత సుఖపడుతున్నారే మనము కొంచమన్నా సుఖపడ్డవద్దా అనుకునేవారు కొందరు. మొత్తముమీద అందరూకూడా ఎవరికితగిన సోమరితనం వారు నేర్చుకుని, సొంతకాని అనేది ఎఱుగక, భర్త కాని యిస్తే పువ్వులు కొనాలి, లేదంటే ఆయనను సాధించాలి అనే ఉద్దేశ్యమే తప్ప, వారిదగ్గర ఉన్నదో లేదో, మన సొంత కృషివల్ల కాని సంపాదించుదాము అనుకునేవారు బొత్తుగా తగ్గిపోతున్నారు, అంతా నాగరికులే అవుతున్నారు. గనుక లోకానికి సంఘానికి ఆదర్శం చూపించుదామని చేస్తున్నాను గాని, ఈ డబ్బు లేకపోతే నాకు జరక్క కాదు. మాలతీ నిన్ను ఆక్షేపించాననుకోకు సుమా. మాటవరుసకు చెప్పాను. లోకపరిస్థితి ఇట్లా ఉన్నది.’

‘ఇందిరా! నీవు ఆక్షేపించినాసరే గాని, దుర్బలమో, సోమరితనమో గాని ఈ పల్లెటూరి పనులు మట్టుకు నేను చెయ్యలేనే.’

‘పల్లెటూరి పనులు కష్టమంటావుగదా? నీవు పుట్టినదే ఊరు? నిన్ను ఇచ్చినదే ఊరు?’

‘రెండూ పల్లెటూళ్లైనా, బస్తీలో ఉండటం అలవాటైన తరువాత పల్లెటూళ్లో ఉండటం కష్టం. ఈ ఊళ్లో పిల్లలకు బిస్కత్తులన్నా దొరకవు. బజారుకు వెళ్లుతామని, షికారుకు వెళ్లుతామని పిల్లలు ఒక్కటే గోల. నాకూ ఏమీ తోచటంలేదు. పగలంతా కుట్టుగోవడం, అల్లుకోవడం, నాలుగు గంటలకు క్లబ్బుకు వెళ్లడం, ఏడుగంటలకు సినీమాకు వెళ్లడం-ఖులాసాగా కాలం గడుస్తూఉంటుంది మావూళ్లో. ఎల్లాగైనా బస్తీలో సుఖంగా ఉంటుంది గాని, పల్లెటూళ్లో ఏంసుఖం?’

‘కష్టపడి కాయకష్టంచేసి పూయించి, కాయించి, పండించి తెచ్చి మీ బస్తీలో కుమ్మరిస్తూంటే మీబోటివాళ్లు సుఖపడటానికి అలవాటుపడ్డారు. అంతా సుఖపడటానికే కూర్చుంటే కష్టపడి ముద్దినుసులూ పండించేవారెవరు? కష్టపడి పండించేవారు లేకపోతే మీబోటివారు సుఖపడడానికి అవకాశం యెట్లా కలుగుతుంది?’

‘కష్టపడి పండించేవారు యెప్పుడూ ఉంటారు. వాళ్లు కష్టపడి పండించక, బస్తీకితేక అమ్ముకోక పోతే వాళ్లకు జీవనాలెల్లా గడుస్తాయి? డబ్బున్నవాళ్లు యెక్కడైనా కొనితెచ్చుగుంటారు.’

‘మాలతీ! నీవు గర్వపడబోకు. డబ్బున్నవాళ్లు యెక్కడతెచ్చుగున్నా, కష్టపడి పండించినవాళ్ళ దగ్గిరేకదా? పల్లెటూరివాళ్లకు బస్తీ అవుసరములేదు గాని బస్తీవాళ్లకు పల్లెటూరే అవుసరము. బస్తీవారు వాడే తినుబండములన్నీ పల్లెటూళ్లవే గాని, బస్తీవి పల్లెలకు అవుసరములేదు. పల్లెటూళ్లమీద బస్తీలు ఆధార పడిఉన్నాయి గాని బస్తీలమీద ఆధారపడి పల్లెలు ఉండలేదు. పల్లెటూళ్లలో లేని వస్తువు లేదు. రాజోప భోగములకు అలవాటుపడకపోతే బస్తీతో అవుసరములేకుండా జీవిస్తవి పల్లెటూళ్లు.’

‘ఇందిరా నీవు పల్లెటూళ్లను మహా పొగుడుకుంటున్నావు గాని బస్తీకొచ్చి ఏదీ కొనకుండా యెల్లా జీవిస్తారు?’

‘సుఖంగా జీవిస్తాము. ఆముదములు, నువ్వులు, కొబ్బరి పండుతవికదా? తాలింపుకు, తలనూనెకు, దీపపు చమురుకు బస్తీ అవుసరములేదు. తరువాత చింతపండు, ఉప్పూ, మిరపకాయలు మా పంటలేకదా? వరి, జొన్న, సజ్జ మొదలైన పంటలు చెప్పనవసరమే లేదు. బెల్లము, మినుము, శనగ, పెసర మొదలైన కాయ ధాన్యములు పల్లె పంటలే. కంద, చామ, పెండలము, ఉల్లి, చిలగడము, పసుపు మొదలైన గడ్డ పంటలు పల్లెటూళ్లవే కదా? గోగునారకూడా ఇక్కడే పండుతుంది. గొడ్లపలుపులు, చాదత్రాళ్లు, వ్యవ సాయపు మోకులు తయారుచేసుగోడానికి నార సమృద్ధి. రాజభోగములు అవుసరములేకపోతే, ఇంతవరకు నేను చెప్పిన వస్తువులతో బస్తీ అవుసరములేకుండా భుజించి నిద్రించవచ్చు. ఇక వస్త్రములకు తప్పదంటావా? అదీ అవుసరములేదు. రాట్నములున్నవి. చేలలో ప్రత్తి పండుతుంది. ప్రత్తి దేనికదితీసి ఇచ్చేవారుకూడా ఇక్కడనే ఉన్నారు. ఏకులు వడుకుట అందరికి చేతనైన పనేకదా? దారంతీస్తే నేసేవారు సాలీలున్నారు, మాలదాసరులున్నారు. చక్కగా నేసి ఇస్తారు. రంగులు కావలెనన్నచో, నీలిఆకు ఇక్కడనే పండుతుంది. అది మందు తయారుచేసి నీలిరంగు, జాబరా విత్తనములు పండుతవి వాటితో జాబరారంగును వేసిఇస్తారు. ఇక బస్తీతో అవుసరమేమున్నది? గుడ్డలు కుట్టటానికి జంగాలున్నారు, చెప్పు మాలతీ, మాట్లాడవేం? బస్తీతో అవుసరములేకుండా మేము హాయిగా జీవిస్తాము. పల్లెటూరితో అవుసరములేకుండా మీరు ఉంటారా? చెప్పు.’

'ఏం మాట్లాడను ఇందిరా! నీవలా ఉపన్యాసం ఇస్తూఉంటేను. పోనీ, పాత్ర సామానుకన్నా రానక్కర్లేదా?'

'అదీ అవుసరములేదు మాలతీ! మనపెద్దలు మట్టిపాత్రలు వాడేవారు. మనమవ్వి వాడకపోయినా ఇత్తడివి చేసేవారుకూడా ఇక్కడనే ఉన్నారు. రాచ్చిప్పలుకూడా యిక్కడికే వస్తూఉంటాయి. రాకపోయినా యిబ్బందిలేదు. మట్టిపాత్రలు వాడుకుంటాము గాని ప్రత్యేకము వాటికొరకు ఇంకొకచోటికి వెళ్లవలసిన అవుసరములేదు.'

'ఎచ్చె కుండలెల్లా వాడుతావే? యిందిరా?'

'బాగానేవాడుతాను, కుండలో అన్నంవండితే చలువ. ఆరోగ్యముగా ఉంటుంది. జబ్బులుండవు. అల్యూమినీయం పాత్రలు వాడితే జబ్బులు వస్తాయి. ఒకప్పుడు ప్రమాదంకూడా కలుగుతుంది.'

'ఇందిరా! ఇక్కడివాళ్లకు మట్టుకు జబ్బులు రావడంలేదూ?'

'జబ్బులువచ్చినా మీమాదిరిగా ఎక్కువరోజులు బాధించవు. డాక్టర్లకు యెక్కువడబ్బివ్వక్కర్లేదు.'

'నీవు యెన్నన్నా చెప్పు. ఇందిరా నా మనస్సుకుమాత్రం బస్తీ సౌకర్యాలే సుఖంగాని పల్లెటూళ్లు సుఖంలేదనిపిస్తాయి. ఇక వెళ్లివస్తా యిందిరా. పసిపిల్ల పాలకేడుస్తుంది.'

'అప్పుడే వెళ్లుతావా? మాలతి! నీతో మాట్లాడి చాలారోజులైంది. పిల్ల ఏడిస్తే మీ చెల్లెలు తీసుకొస్తుందిలే. కొంచముసేపు కూర్చుందూ. క్రొత్తగా వస్తువులేవన్నా చేయింపుకున్నావా?'

'ఇంకా సొమ్ములకుకూడా డబ్బు మిగులుతుందా? యేనెల కానెల పోనీపోనిగా సరిపోతుంది.'

'నూరు రూపాయలు జీతం అంటివికదా? ఏంచేస్తారు డబ్బంతా? మీవారు నీచేతికివ్వరూ?

'అదేమీలేదు. అంతా వాడుతాము. ఆదాయముకంటే ఖర్చే యెక్కువకనిపిస్తుంది. పదిరూపాయలు కాఫీఖర్చులకే కావాలి. అదిగాక ఇంటిఖర్చుకావాలి. ఇవిగాక నాకు నా క్లబ్బుచందా, వారికి వారిటౌన్ హాలు చందా, సబ్బులని, హెయిర్‌పిన్నులని, పౌడర్లని, రిబ్బన్‌లని వాటికి కొంత. పిల్లలకు గ్లాక్సో బిస్కత్తులని, వేరే వాళ్లకు త్రాగటానికి పాలు, పండ్లు, టానిక్కులనీ, పిల్లల ఆట వస్తువులనీ—ఇల్లాంటివి యెన్నో ఖర్చులు; ప్రతినెల డాక్టరుబిల్లు తప్పదు. పనిచేసేమనిషి, ప్రొద్దుగూకులు ఇంట్లోఉండి పిల్లలను ఆడించే నౌకరు, ప్రేవేట్లు, స్కూలుజీతాలు తప్పనిసరి. వ్రూసలని, దారాలని ఇల్లా కొంతఖర్చు. నెలవచ్చేటప్పటికి జీతంగాక ఇంటినుంచికూడా తెప్పిస్తూంటూరు డబ్బు. గుఱ్ఱపుబండీవాడికే నెలకు పదిరూపాయలియ్యాలి. తగ్గించేఖర్చు వక్కటన్న కనపడదు ఇందిరా!'

'మాలతీ! మీకేం మహారాజులు. యెంతైనా ఖర్చుపెడతారు. యింటిదగ్గిర యెవరున్నారు?'

'మా మామగారు ఉండి పొలంపనులు చేయిస్తూఉంటారు. అన్నట్లు మరిచిపోయాను. 'మునుపు వొచ్చినప్పుడు నీవుకూడా యేవోదారాలు అవ్వి కావాలంటివే ఇందిరా?

'నీవుచెప్పిన పనులన్నీ డబ్బుఖర్చుఅయేవి. ఆ డబ్బు విదేశానికి పోయేదితప్ప మనదేశంలో ఉండేది ఒక్కకానికూడాలేదు. అందుకని అవి కొనడం నాకిష్టంలేదు, మాలతి! అవి కొనడానికి డబ్బుకావాలి. అదీ కాక ఇంట్లోపనులన్నీ చాలించుగుని అవి కుట్టటమో, అల్లటమో చెయ్యాలి. రాట్నంవడికితే ఇంటికి, దేశానికి క్షేమం. ఆ మిగిలినకాని ధర్మంచేస్తే కుంటి, గుడ్డి బ్రతుకుతారు. 'కదురుతిరిగినా, కవ్వంతిరిగినా, కాటకముండ'దన్నారు పెద్దలు.

'యిందిరా! నీకు కాంగ్రెసన్నా, ఖద్దరన్నా చాలా అభిమానం ఉన్నట్లున్నది. నాకూ కూడ ఉన్నది గాని ఆ మొద్దుచీరలు నేకట్టలేనే ఇందిరా! నీవు విదేశం అసలే కట్టవా?'

'కట్టడం మొదలుపెట్టినతరువాత కొంతఅది కొంతఇది యెందుకు? ప్రక్కనకూడా విదేశీగుడ్డ వేసుకోను.'

'పిల్లలకేం కడతావు?'

'మేం కట్టిస్తే ఖద్దరేగాని, చుట్టపక్కాలు కుట్టిస్తే కట్టుకుంటారు పిల్లలు. నాకుమాత్రం విదేశీవి పెట్టరు. పెట్టినా నేను కట్టుకోను'

'ఇందిరా వెళ్లివస్తా నీకూ వంటవేళైంది.'

'మాలతీ నీవు వెళ్లేలోపల ఒక్కమాటు వచ్చి వెళ్లు. వీలుగాఉంటే నేనే వస్తాలే'

'ఇంకా వెళ్లేలోపలెప్పుడు? రేపు మధ్యాహ్నంనుంచీ వెళ్లుతాను'

'అప్పుడే యేం తొందరే? వారంరోజులన్న ఉండవూ?

'నిన్నటినుంచీ రెండోవాడికి జ్వరం. పిల్లలుముగ్గురు నాతోనే వచ్చారు, తీసుకుపోకపోతే మా అమ్మ కోప్పడుతుంది. ఈ జ్వరాలు అంటుజ్వరాలో యేమోగాని మా అమ్మకు తగ్గింది, పిల్లవాడికి వచ్చింది. ఈ జ్వరం యెక్కువైతే వాళ్ల నాన్నగారు కోప్పడతారు. డాక్టరుగారు చేప్పారు నీళ్లుమారిస్తే పిల్లలకు జబ్బు చేస్తుందని. అల్లాగే వచ్చిందికూడాను. నాకు భయంగాఉన్నది. తప్పక రేపువెళ్లుతానే. వాళ్లకు తెలుగు మందులు సరిపడవు.'

'ఇక్కడ మట్టుకు పరాయివాళ్లా? మాలతి! అట్లా భయపడతావు?'

'అల్లాకాదు ఇందిరా. పిల్లలకు ఏదన్నా వక్కరవ్యవస్తె మామూలు డాక్టరు మందివ్వాలి, వారు దగ్గిరుండాలి గాని, యింకొకచోట ఉంటే ఒప్పుకోరు. వెళ్లివస్తా ఇందిరా. జ్ఞాపకముంచుకో' అని వెళ్లిపోయింది మాలతి.

ఇందిర పుట్టినిల్లు వడ్లమూడి. అత్తవారిల్లు అనంతవరం. గొప్పయింట పుట్టినది. గొప్పఇంటికొచ్చినది. అయినప్పటికి గొప్పదాననన్నే స్వాతిశయం లేకుండా ఇంటిపనులన్నీ తాను స్వంతముగా చేసిచూపించి నౌకర్లచేత చేయిస్తుంది. అవుసరమైతే తానుకూడా చేసి లోకానికి ఆదర్శం చూపవలెనని ఆమె ఉద్దేశ్యం.

ఇందిర చదువుకున్నది. తెలివికలది. బుద్ధిమంతురాలు. డబ్బుకూర్చే మార్గములు అవలంబించినా లోభత్వము లేకుండా బీదసాదలకు అంతో ఇంతో బెడుతుంది. పతిభక్తి, దైవభక్తి ఆమె ముఖ్యవ్రతాలు. ఇందిర చామనచాయలో చక్కనిదని చెప్పక తప్పదు. చెంపకు చారెడుకండ్లు, వీపున బారెడు జడ, కురుచగా అందమైన మనిషి. ఇందిర భర్త సుందర్రావుకూడా ఆమెకుతగిన పురుషుడు, అన్నివిషయములలోనూ ఆమెకు అనుకూలముగా ఉంటాడు. అతనుకూడా సోమరికాడు. పొలముపనులన్నీ తాను సొంతముగా చూచి చేయించుగుంటాడు గాని పనివాళ్లమీద వదిలిపెట్టడు. బాగా చదువుకున్నవాడు కావడంచేత ఊళ్లో యెవరికన్నా వ్యవహారములు దీబ్బాపేక్షలేకుండా సత్యముగా చేసిపెడుతూ ఉంటాడు. భార్య చెప్పినట్లు భర్త, భర్త చెప్పినట్లు భార్య తూచా తప్పకుండా సంసారయాత్ర సుఖంగా గడుపుతున్నారు ఇందిరా సుందర్రావులు.